...దా నిలయం
శ్రీకాకుళం

# మాయలేడి

"ఓటరు మహాశయులకు నమస్కారం.

రాజులు పోయారు. రాజ్యాలు పోయాయి.

వైభవాలు పోయాయి. వైభోగాలు పోయాయి. బానిసత్వపు బాధలు పోయాయి. ఈ నేల, ఈ నీరు, ఈ గాలి...ఇవన్నీ కలగలిపిన ఈ దేశం మనకి పూర్తి అధికారాలతో లభించింది. తెల్లదొరలు వదిలిన కుర్చీల్లో నల్లదొరలు కూర్చున్నారు.

కనకపు సింహాసనమున–అన్నట్టు బంగారం మీద కూర్చున్నందుకు అది మైలపడింది కానీ వీళ్ళు శుభ్రపడలేదు...

అయ్యలారా!

ఇంతకుముందు మన ప్రతినిధిగా పార్లమెంటుకి వెళ్లిన పెద్ద మనిషి తను పెట్టిన ఖర్చు రాబట్టుకునేందుకు పడిన తంటాలు పూర్తి కాకుండానే మళ్ళీ ఎలక్షన్లొచ్చేశాయి.

మరి కాస్సేపటిలో మీ ముందుకు రాబోతున్నాడు. రెడీగా వుండండి.." అంటుండగానే దుమ్ములేపుకుంటూ అంబాసిడర్ కారు ఎండలో తెల్లగా మెరిసిపోతూ సమావేశ స్థలానికి దూసుకువచ్చింది.

అంతవరకు జనజాగృతి మంత్రం పఠించిన పాత తరం పంతులుగారు జనం మధ్యలో నిలబడ్డాడు.

కారు ఆగింది.

కనకయ్యగారు ముకుళిత హస్తాలతో మందహాసంతో కారులోంచి బయటికి వచ్చాడు.

నమస్కార ముద్రతో అందరి వైపు కలియజూశాడు.

పెదవుల మీద మందహాసాన్ని మరింత పెద్దది చేశాడు.

ప్రతిస్పందన లేకుండా ప్రజలు కళ్ళప్పగించి చూస్తున్నారు.

పట్టించుకోకుండా అభివాదం చేశాడు.

మైకుముందు నిలబడ్డాడు.

గొంతు సవరించుకున్నాడు.

గొంతు విప్పాడు.

అంతే...

జనం మీదికి జడివాన కురిసినట్లు, అకాల వర్షంలా, వాయుగుండం వల్ల చెలరేగిన ప్రకృతి వైపరీత్యంలా, వాగ్దానాల వెల్లువ ముందుకొచ్చింది. కొందరు కొట్టుకుపోయారు. కొందరు సందేహాల తుమ్ములతో సతమత మయ్యారు. కొందరు కొయ్యదుంగల్లా చలించకుండా నిలబడ్డారు. కనకయ్యగారి మాటలతో 'మాయలేడి' లాంటి భవిష్యత్ భ్రమ అలా మనిషికొక రీతిగా మనసు చలింపజేసింది.

"అందువల్ల మహాజనులారా! మీ అతి విలువైన, పరమ పవిత్రమైన ఓటును ప్రజాసేవకి అంకితమైన మా పార్టీకి వేసి, అఖండమైన మెజార్టీతో గెలిపించి, మన నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడవలసిందిగా మీ అందర్నీ పదేపదే ప్రార్థిస్తున్నాను" ముక్తాయింపు మాటలు చెప్పి, నమస్కార మందహాస ముద్రలతో వెళ్ళి కారులో కూర్చున్నాడు కనకయ్య.

కారు బుర్రుమని స్టార్టయి తుర్రుమంది.

దుమ్ము మేఘం లేచి ప్రజలందరినీ ఆలింగనం చేసుకుని తలోకాస్త దుమ్ము కళ్ళలో కొట్టింది.

ప్రజలు కళ్ళు నులుముకుని చూశారు. మాయలేడి కనుమరుగయింది.

దురద బాధించింది. కళ్ళమంట మిగిల్చింది.

000

"మాస్టారూ! మీరు చెప్పిందంతా నిజమే. 'మాయలేడి' లాంటి మాయ వాగ్దానాలు నమ్మి ప్రతిసారీ మోసపోతూనే వున్నాం. సీతమ్మోరు లాంటి నమ్మకం గీత దాటక తప్పటం లేదు" నిస్సహాయంగా పలికిందొక గొంతు.

చిలకజ్యోతిష్యాన్ని కూడా నమ్మకుండా ఉండలేం. మనిషి మాటలు నమ్మకుండా ఎలా వుండగలం?" మరొక గొంతు.

"మన భవిష్యత్తునేదో ఉద్ధరిస్తారనేగా వీళ్ళని అందలం ఎక్కించటం" ఇంకొక గొంతు.

"దుర్గమ్మతల్లికి దేవతలందరూ తమ అస్త్రాలు, శక్తులూ ఇచ్చి మహిషాసురుని చంపించినట్లు, ప్రజలందరూ తమ జీవశక్తి లాంటి ఓట్లిచ్చి నాయకుణ్ణి చేసి దారిద్ర్యం, అక్షరాస్యత, అనారోగ్యం, అభద్రత లాంటి రాక్షస సమస్యల్ని సమయింప జేయమంటే, వీళ్ళు మనల్నే సమస్యలకి అప్పగించి, బలిపశువులు చేస్తున్నారు" మరో మాస్టారు.

మాస్టారు మౌనంగా అందరి మాటలూ విన్నాడు.

వాళ్ళ బాధ అర్థం చేసుకున్నాడు.

ఊరి సమస్యలు మననం చేసుకున్నాడు.

రోడ్లు గోతులమయం.

అందుకే బస్సులు రద్దు చేశారు.

స్కూలు కూలటానికి సిద్ధంగా వుంది. మాస్టార్ల జీతాల బకాయిలు ఆరు నెలలు దాటాయి.

ఇప్పుడిక్కడ సరస్వతి మూగవోయింది.

జీవిక కోసం మాస్టార్లు మరో వ్యాపకాన్ని ఆశ్రయించారు.

పిల్లలకు ప్రకృతి బడి అయ్యింది.

కోతి కొమ్మచ్చులే నిత్య కాలక్షేపా లయినాయి. వాళ్ళ వంటిమీద బట్టల్లాగానే భవిష్యత్తు కూడా చింకిపాతలా అతి దీనంగా అందనంత దూరంలో కన్నీరు కారుస్తూ నిలబడి వుంది.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అనారోగ్యంతో చివరిశ్వాస పీలుస్తోంది.

ఆకాశంలో వుండాల్సిన మబ్బులన్నీ రైతులు గుండెల్లో ముసిరి, మున్నీరు కన్నీరుగా విలపిస్తున్నాయి. నింగి నీటి శూన్యమై, నేల గుండె బీటలు వారింది. ఎటు చూసినా దీనత్వం. ఎవరి మాట విన్నా దైన్య పూరితం.

బరువుగా నిట్టూర్చాడు.

"ఓటు వెయ్యటం దేనికి?" మన వేలితో మనకన్నే పొడుచుకోవటం దేనకి? ఈ మాటు ఓట్లు వెయ్యటం మానేద్దాం.."

మాస్టారు ఆ కుర్రాడి కేసి మౌన మందహాసంతో చూశాడు.

"ఓటు మానటం దేనికి? ఓటు కింత అని వసూలు చేసి, ఆ డబ్బుతో ఊరుని బాగు చేద్దాం..."

అదే మందహాసంతో ఆ మధ్య వయస్కుడి వైపు కూడా చూశాడు మాస్టారు.

"మనం ఓట్లు వెయ్యకపోతే దొంగ ఓట్లు వేయించుకుంటారు. ఆళ్ళకియన్నీ కొత్త కాదు.."

మాస్టారు నవ్వాడు.

"చూశారా? ప్రజాస్వామ్యం ప్రజాస్వామ్యం అని సంబరపడ్డాం. మన భవిత విధాతలం మనమే అని గర్వపడ్డాం. వజ్రాల వంటి వ్యక్తిత్వాలు కాలవాహినిలో అడుగు చేరాయి. వెదురు వాసాల్లాంటి చెదురు మనుషులు పైకి చేరి జాతికి చేటు చేస్తున్నారు.."

"నిజమే! ఈ పరిస్థితులలో మనమేం చెయ్యాలో మీరే చెప్పండి. ఓటు మానెయ్యాలా?.. డబ్బులు తీసుకు వెయ్యాలా?..వేస్తే ఎవరికెయ్యాలి?..ఎవర్ని నమ్మాలి?..ఎవర్ని నమ్మ కూడదు?"

"అవును! నేనూ ఈ ప్రశ్నలకి సమాధానాలనే వెతుక్కుంటున్నాను. ఇంకా మనకి సమయం వుంది. ప్రశాంతంగా ఆలోచించుకుని నిర్ణయించుకుందాం" రచ్చబండ దగ్గర్నుంచీ ఇంటికి వెళ్ళటానికి లేచాడు మాస్టారు.

"మాస్టారూ! మేమందరం మీరెట్టా చెబుతే అట్టా చేస్తాం. గంగలో దూకమన్నా దూకుతాం?"

మాస్టారు వాళ్ళందరివైపు కృతజ్ఞతగా చూసి, చేతులు జోడించి నమస్కరించాడు.

"మళ్ళీ రేపు కలుద్దాం" అని ఇంటికి దారి తీశాడు.

000

మంచంమీద నడుం వాల్చి, తలకింద చేతులు పెట్టుకుని మనసులో వేధిస్తున్న సమస్య గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు మాస్టారు.

ఎవరో పాదాలు వత్తుతుంటే ఆశ్చర్యంగా చూశాడు.

దత్తపుత్రుడు దామోదరం! క్లుప్తంగా 'దామూ' అని పిలవటం అలవాటు.

"ఏమిట్రా దామూ! యింకా నిద్రపోలేదా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"లేదు నాన్నగారూ!"

"ఎందుకని?" లేచి కూర్చున్నాడు.

"మీతో కొంచెం మాట్లాడాలి.."

"నాతోనా?"

"అవును"

"ఏమిటది?"

"నేను ఇప్పటిదాకా ఏ ఉద్యోగంలో చేరలేకపోయాను. మీకు ఏ విధంగానూ సాయం చెయ్యలేక పోతున్నాను.."

మాస్టారికి జాలివేసింది.

మనిషిలో పరివర్తనకి, పశ్చాత్తాపం మొదటి మెట్టు.

మహా పాపాత్ముణ్ణి సైతం పరమాత్మ పశ్చాత్తాపాగ్నిలో కాలిపోతుంటే కాపాడి కరుణిస్తాడు.

"దాని దేముందిలే! నీ చేతుల్లో పని కాదు కద. దేనికైనా సమయం రావాలి.." ఓదార్పుగా అన్నాడు.

"ఆ సమయం ఇప్పుడు వచ్చింది నాన్న గారూ.."

మాస్టారికి కొద్ది క్షణాలు ఏమీ అర్థం కాలేదు.

"నీకు ఏమైనా ఉద్యోగం వచ్చిందా?"

"అలాంటిదే!"

"అలాంటిదే అంటే..."

"నన్ను కనకయ్య గారు తన దగ్గర పని చెయ్యమన్నారు. మెల్లగా అన్నీ నేర్పి తనంత వాడిని చేస్తానన్నారు.."

మాస్టారికి విషయం అర్థమైపోయింది.

తనను తన దారికి తెచ్చుకోవడానికి విఫల యత్నాలు చేసి, చివరకు అమాయకుడైన దత్తపుత్రుడికి వల వేశాడన్నమాట.

"నువ్వా కనకయ్య దగ్గరకి వెళ్ళొద్దని చెప్పాను కదా?"

"ఏం చెయ్యను? ఇంట్లో ఊరకే కూర్చుంటే ఏమీ తోచట్లా..అలా బజారుకి వెళితే వెంటనే కనకయ్య గారి మనుషులు బలవంతాన లాక్కువెళ్ళారు. కనకయ్య గారు బోలెడు మర్యాదలు చేసి..ఇదుగో ఈ వెయ్యిరూపాయలూ జేబులో పెట్టాడు" నోట్లకట్ట తీసి చేతిలో పెట్టాడు.

మాస్టారి కంటికి అది పడగ విప్పిన పాములా కనిపించింది.

అందులో వికటాట్టహాసం చేస్తూ విషం కక్కుతున్న కనకయ్య మొహం కనపడింది.

చటుక్కున వదిలేశాడు.

మంచం మీద పడింది.

"బాబూ! ఇది పాముకన్నా ప్రమాదమైంది. దీని మాయలో పడకు. ఇటుపైన నువ్వెప్పుడూ ఒంటరిగా బయటకు వెళ్ళకు. నా వెంబడే తిరుగు..నువ్వు ఏమీ చెయ్యకపోయినా ఫరవాలేదు. క్షేమంగా వుంటే అదే చాలు.."

"అలాగే నాన్నగారూ! మీరు చెప్పినట్టే చేస్తాను.." అమాయకంగా అన్నాడు.

"గుమ్మంలో వీరయ్య పడుకుని వుంటాడు. నేను రమ్మన్నానని చెప్పు.."

"అలాగే నాన్నగారూ!.." పిలవటానికి వెళ్ళాడు.

వీరయ్య అంటే అపర వీర హనుమాన్! ఎంత మందికైనా కర్రసాములోగానీ, కొట్లాటలో గానీ, సమాధానం చెప్పగల దిట్ట. తనకే ఆపదా కలగకుండా కాపలాగా తన వెంట నంటి వుంటాడు. రాత్రిళ్ళు గుమ్మం దగ్గరే పడుకుంటాడు.

"ఏంటి అయ్యగారూ!.."

"వీరయ్యా! ఈ వెయ్యి రూపాయలూ నీ దగ్గరుంచు..కనకయ్య బలవంతంగా మా అబ్బాయి జేబులో పెట్టాడట. రేపు ఏదో రకంగా దీన్ని అతనికి అందజెయ్యి"

"అలాగే బాబూ!" అంటూ అందుకుని బొడ్డున పెట్టుకున్నాడు.

"కనకయ్య గారికి కోపం వస్తుందేమో" భయంగా అన్నాడు దామూ.

"ఇక దాని విషయం నువ్వు మర్చిపో..వెళ్ళి హాయిగా పడుకో"

"అలాగే.." అంటూ తన మంచంకేసి వెళ్ళాడు.

వీరయ్య కూడా గుమ్మంవైపు వెళ్ళాడు.

మాస్టారు బరువుగా నిట్టూర్చి నడుం వాల్చాడు.

◆ ◆ ◆

"ఒరేయ్..లేడికి బదులు దున్నపోతు వస్తోంది. విషయమేంటో చూడండిరా.." కనకయ్య పులిలా పెంచుకున్న కుక్కని దువ్వుతూ భృత్యులకి ఆదేశం ఇచ్చాడు.

యమదూతల్లాంటి ఇద్దరు ఎదురు వెళ్ళారు.

శరీరంలో ఒక భాగంలా వున్న బాణా కఱ్ఱతో వీరయ్య నేల అదిరేలా అడుగులు వేస్తూ వస్తున్నాడు.

"ఏంటి విషయం?" అడ్డంగా నిలబడి అడిగారు దూతలు.

వీరయ్య ఆగి ఒకసారి కనకయ్యకేసి చూశాడు.

ఓరగా క్రూరంగా తనకేసే చూస్తున్నాడు.

బొడ్లోంచి డబ్బు తీసి ఒకడి చేతిలో పెట్టి 'పిల్లకాయల్తో పరాసికాలు ఆడొద్దని సెప్పు మీ అయ్యగారికి.." అని విసురుగా వెనుదిరిగాడు.

సైగలతో 'ఏమి'టని అడిగాడు కనకయ్య.

డబ్బు కనిపించేలా వేళ్ళతో పైకెత్తి పట్టుకు చూపించాడు.

విషయం అర్థమై, అవమానకరంగా అనిపించి, వీరయ్యని ఓ పట్టు పట్టమని సైగ చేశాడు.

"రేయ్ ఆగరా!" అని వెంటపడ్డారు.

వీరయ్య వెనుదిరిగాడు. పరిస్థితి గ్రహించాడు. బాణాకఱ్ఱ సిద్ధంగా పట్టుకున్నాడు. మూడు నిమిషాల్లో ఇద్దర్నీ మట్టి కరిపించాడు.

కనకయ్య ఆగ్రహంగా లేచి నిలబడ్డాడు.

కాలభైరవుడి లాంటి కుక్కని ఉసిగొల్పాడు.

దగ్గరదాకా రానిచ్చి ఒకే ఒక దెబ్బ.

గింగిరాలు తిరుగుతూ పడిపోయింది పాపం అల్పప్రాణి.

కనకయ్య కోపం కట్టలు తెంచుకుంది.

జేబులోంచి పిస్టలు తీశాడు.

◆ ◆ ◆

రచ్చబండ.

అందరూ మౌన గంభీరంగా వున్నారు.

మాస్టారు నోరు విప్పాడు.

"మనందరం ఓట్లు వేస్తున్నాం. అది మన ప్రాధమిక హక్కు. దాన్ని త్యాగం చెయ్యటం

కానీ అమ్ముకోవటం గానీ రెండూ అపరాధమే. అపచారమే. మనకి మనమే ద్రోహం చేసుకున్నట్టు. అయితే ఎవరికి ఓటు వెయ్యాలి? ఎట్టి పరిస్థితుల్లోను మాయ మాటలతో పదే పదే మోసగిస్తున్న మారీచుడు లాంటి కనకయ్యకి కాదు.."

"ఇంకెవరికి?"

"ఎవరి ఒత్తిడీ లేని దయాదాక్షిణ్యాలవసరం లేని స్వతంత్ర అభ్యర్థికి ఓటు వేద్దాం. ఆ వ్యక్తి మన ఊరివాడే కావాలి.."

అందరూ చప్పట్లు కొట్టారు.

"ఆ వ్యక్తి మీరే అయితే బావుంటుంది మాస్టారూ..."

నవ్వాడు. "కాదు..రావణాసురుల్లా తయావుతున్న రౌడీ నాయకుల్ని తట్టుకోవాలంటే వీరయ్యలాంటి వీరుడు మన ప్రతినిధిగా నిలబడాలి. రాజ్యం వీరభోజ్యం అన్న ఆది సూక్తి కిప్పుడు మళ్ళీ కాలం వచ్చింది.."

అందరూ చప్పట్లు కొట్టారు. మాస్టారుకి జేజేలు పలికారు.

అంతలో అక్కడికి కనకయ్య కారు వచ్చింది.

అందరూ ఆశ్చర్యంగా చూస్తుండగా కనకయ్య చేతులు కండువాతో బిగించబడి వీరయ్య చేత ముందుకు తోయబడుతూ మాస్టారి కాళ్ళమీద పడ్డాడు. వెనకాల చేతులు పట్టుకుని డ్రైవరు నిస్సహాయంగా నిలబడ్డాడు. వీరయ్య జరిగిందంతా వివరించాడు. కిందపడిన కుక్క శరీరం అడ్డం పెట్టుకుని కనకయ్య పిస్టలు గుళ్ళ నుంచి ఎలా తనని తాను రక్షించుకుంటూ కనకయ్యని బంధించి తెచ్చిందీ అందరికీ చెప్పాడు.

దాంతో ఆగ్రహం పెల్లుబికిన జనం కనకయ్య మీదకి విరుచుకు పడుతుంటే చేతులెత్తి ఆపేశాడు మాస్టారు.

"ఇప్పుడితను మాయ విడిచిన మారీచుడు. మనకి ఎవరి ప్రాణాలు తీసే హక్కు లేదు. వదిలెయ్యండి. మనిషయితే మారతాడు..వదిలెయ్యండి.."

కనకయ్య మాస్టారి పాదాలు గట్టిగా పట్టుకుని భోరున ఏడిచాడు.

(జాగృతి వారపత్రిక)